# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 216 | పేజీలు: 4 | వెల: రూ.4/- | శుక్రవారం 3 ఏప్రిల్ 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




### తెలంగాణలో 2 లక్షల

# కొత్త పెన్షన్లు..

## రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

**చేయూత కింద 2 లక్షల కొత్త పెన్షన్లకు ప్రభుత్వం ఆమోదం**

**బడ్జెట్‌లో రూ.233 కోట్లు కేటాయించిన రేవంత్ సర్కార్**

**మూడేళ్లుగా పేరుకుపోయిన 12 లక్షలకు పైగా దరఖాస్తులు**

**లబ్ధిదారుల ఎంపిక అధికారులకు అతిపెద్ద సవాల్**




**హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే ఉదయం)**

తెలంగాణలో కొత్త పెన్షన్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. చేయూత పథకం కింద కొత్తగా మరో 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ.233 కోట్లను కేటాయించడంతో, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధమైంది. అయితే, ఇప్పటికే పేరుకుపోయిన లక్షలాది దరఖాస్తుల నుంచి అర్హులను గుర్తించడం అధికారులకు పెను సవాల్‌గా మారనుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీలలో 42.23 లక్షల మంది నెలనెలా చేయూత పెన్షన్లు పొందుతున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు, హెచ్ఐవీ, బోదకాలు బాధితులకు నెలకు రూ.2,016 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. దివ్యాంగులకు మాత్రం పెన్షన్‌ను రూ.4,016గా ఇస్తున్నారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో 2 లక్షల మంది కొత్తగా చేరనున్నారు. గత మూడేళ్లుగా బోదకాలు, డయాలసిస్ బాధితులకు తప్ప కొత్తగా ఎలాంటి పెన్షన్లు

..మిగతా 2లో



### కాళేశ్వరంపై రాజ్యసభలో

# కిషన్‌రెడ్డి, సురేశ్‌రెడ్డిల వాగ్వాదం

**కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం**

**వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (నమస్తే ఉదయం)**

కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ పనికిరాకుండా పోవడానికి బీఆర్ఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు.

"కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారు" అని

..మిగతా 2లో



### మా గ్యారంటీలపై డౌట్ ఉంటే

# తెలంగాణ రండి

**కేరళ గడ్డపై సీఎం రేవంత్ రెడ్డి సవాల్!**

**కొచ్చిలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ మేనిఫెస్టోను విడుదల**

**కొచ్చి, ఏప్రిల్ 2 (నమస్తే ఉదయం)**

కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ మేనిఫెస్టోను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కొచ్చిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన కేరళ సీఎం పినరాయి విజయన్, మాజీ సీఎం కేసీఆర్, ప్రధాని మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు అమలు సాధ్యం కావని విమర్శించే వారు ..మిగతా 2లో


# 'అమరావతి బిల్లు'కు రాజ్యసభ ఆమోదం

**వాకౌట్ చేసిన వైసీపీ**

**అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ చట్టసవరణ బిల్లు**

**రాజ్యసభలో చర్చ అనంతరం బిల్లుకు ఆమోదం**

**ఇప్పటికే లోక్ సభలో బిల్లుకు ఆమోదం**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (నమస్తే ఉదయం)**

ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతికి చట్టబద్ధత దిశగా కీలక ఘట్టం పూర్తయింది. లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లుకు రాజ్యసభ కూడా పచ్చజెండా ఊపింది. రాజ్యసభలో బిల్లుపై జరిగిన చర్చలో అమరావతికి తిరుగులేని మద్దతు దక్కింది. బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన సవరణ బిల్లును కేంద్రమంత్రి నిత్యానందరాయ్ రాజ్యసభలో ప్రవేశపెట్టారు. సభ్యుల సమ్మతితో రాజ్యసభ ఛైర్మన్ సి.పి.రాధాక్రిష్ణన్ బిల్లుపై చర్చకు ఆమోదం తెలిపారు. అమరావతికి చట్టబద్ధతకు కాంగ్రెస్, BJP, TDP, ఆప్, తృణమూల్, BJD, JDU, RJD, BRS, ఉద్ధవ్ శివసేన

..మిగతా 2లో



# న్యాయాధికారుల నిర్బంధం

**బెంగాల్ సర్కార్‌పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం**

**పశ్చిమ బెంగాల్‌లో ఏడుగురు జ్యుడీషియల్ అధికారుల నిర్బంధం**

**ఘటనపై సీబీఐ లేదా ఎన్ఐఏతో విచారణ జరిపించాలని సుప్రీం ఆదేశం**

**ఇది ఉద్దేశపూర్వక, ప్రణాళికాబద్ధ దాడేనన్న భారత ప్రధాన న్యాయమూర్తి**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (నమస్తే ఉదయం)**

పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో ఏడుగురు న్యాయాధికారులను గంటల తరబడి బందీలుగా పట్టుకున్న ఘటనపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఇది కేవలం న్యాయాధికారులను భయపెట్టే ప్రయత్నమే కాదని, సుప్రీంకోర్టు అధికారానికే సవాల్ విసిరేలా ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర ఆగ్రహం

..మిగతా 2లో

# భూసమస్యలకు చెక్..


## భూభారతి పోర్టల్ ప్రారంభం

**సమీకృత భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్:**

రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసి చూపిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. భూ క్రయవిక్రయాల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రూపొందించిన 'సమీకృత భూభారతి' పోర్టల్‌ను రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం విఠాయిపల్లిలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే ప్రజాప్రభుత్వమిది అని అన్నారు. ఈ నెలాఖరులో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జరుగుతుందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిరంతరం కొనసాగుతుందని చెప్పారు.



### రూ.167 కోట్లు పలికిన రాజా రవివర్మ

# 'యశోదకృష్ణ' పెయింటింగ్

**కొనుగోలు చేసిన సైరస్ పూనావాలా**

2లో..

# న్యాయాధికారుల నిర్బంధం



మొదటి పేజీ తరువాయి...

వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) లేదా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)తో విచారణ జరిపించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. దర్యాప్తును తామే పర్యవేక్షిస్తామని స్పష్టం చేసింది.

వివరాల్లోకి వెళితే... ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా తమ పేర్లను తొలగించారంటూ ఆగ్రహించిన కొందరు నిరసనకారులు.. మాల్దాలో ముగ్గురు మహిళలు సహా ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను బుధవారం మధ్యాహ్నం ఘెరావ్ చేశారు. దాదాపు 9 గంటల పాటు వారిని నిర్బంధించారు. అర్ధరాత్రి 1 గంట సమయంలో భారీ పోలీస్, పారామిలటరీ బలగాలు రంగంలోకి దిగి వారిని సురక్షితంగా విడిపించాయి. అధికారులను అక్కడి నుంచి తరలిస్తుండగా వారి వాహనాలపై రాళ్లు, కర్రలతో దాడులు జరిగాయి. ఈ ఘటనలో ఓ కారు అద్దాలు ధ్వంసమయ్యాయి.

ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "సాయంత్రం 5 గంటలకు అధికారులను నిర్బంధిస్తే, రాత్రి 11 గంటల వరకు వారికి సహాయం అందలేదు. ఇది సాధారణ ఘటన కాదు. న్యాయాధికారుల మనోధైర్యాన్ని దెబ్బతీసి, కొనసాగుతున్న ప్రక్రియను అడ్డుకోవడానికి ఉద్దేశపూర్వకంగా, ప్రణాళికాబద్ధంగా చేసిన దాడిలా కనిపిస్తోంది" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. కలకత్తా హైకోర్టు చీఫ్ జస్టిస్ స్వయంగా డీజీపీ, హోం సెక్రటరీకి ఫోన్ చేయాల్సి వచ్చిందని ఆయన గుర్తుచేశారు.

ఈ ఘటనలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తన విధిని నిర్వర్తించడంలో పూర్తిగా విఫలమైందని కోర్టు అభిప్రాయపడింది. అధికారులకు భద్రత కల్పించడంలో ఎందుకు విఫలమయ్యారో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఇకపై అభ్యంతరాల స్వీకరణ సమయంలో ఇద్దరు, ముగ్గురి కంటే ఎక్కువ మందిని అనుమతించరాదని, విచారణ కేంద్రాల వద్ద ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమికూడరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

ఈ సమయంలో బెంగాల్ అడ్వొకేట్ జనరల్ జోక్యం చేసుకోగా, సీజేఐ తీవ్రంగా స్పందించారు. "దురదృష్టవశాత్తు మీ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ రాజకీయ భాషలోనే మాట్లాడతారు. దేశంలోనే అత్యంత ధ్రువీకరించబడిన రాష్ట్రం మీది. అర్ధరాత్రి 2 గంటల వరకు నేనే స్వయంగా పరిస్థితిని పర్యవేక్షించాను. ఆ దుండగులు ఎవరో మాకు తెలియదనుకుంటున్నారా? ఇది చాలా దురదృష్టకరం" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. న్యాయవ్యవస్థపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# 'అమరావతి బిల్లు'కు రాజ్యసభ ఆమోదం



మొదటి పేజీ తరువాయి...

పార్టీల ఎంపీలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలుగు ప్రజలందరికి ఇవాళ చరిత్రాత్మకమైన రోజు అని అన్నారు. "బిల్లు ప్రవేశపెట్టడాన్ని తెలుగు ప్రజలంతా గర్వంగా భావిస్తున్నారు. ప్రజా రాజధాని అమరావతి చరిత్రలో గుర్తుంటుంది. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మా నాయకుడు నేర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని గురించి ప్రజలకు స్పష్టత ఇస్తున్నాం. రాజధాని కోసం ఉద్యమించిన రైతులు, మహిళలకు సరైన న్యాయం దక్కింది. విభజన సమయంలో ఒక రాష్ట్రానికి రాజధాని ఉంది, మరో రాష్ట్రానికి లేదు' అని వెల్లడించారు.

హామీలు అమలు చేయనందుకు పరిహారం ఇవ్వాలి : అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చలో కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి పాల్గొన్నారు. "బిల్లు ప్రవేశపెట్టడం రైతుల విజయం. రాజధాని ఉద్యమ సమయంలో రైతులను, మహిళలను తీవ్రంగా హింసించారు. రాజధానిపై 12 ఏళ్లుగా అస్పష్టతగా ఉంది. అస్పష్టత వల్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. గత సీఎం(వైఎస్ జగన్) మూడు రాజధానుల పేరుతో రాజధాని లేకుండా చేశారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. దుగరాజపట్నం పోర్టు ఇస్తామని హామీ నెరవేర్చలేదు. విభజన హామీలన్నీ అమలు చేయాల్సిందే. ఇప్పటివరకు హామీలు ఎందుకు నెరవేర్చలేదో చెప్పాలి. హామీలు అమలు చేయనందుకు పరిహారం ఇవ్వాలి. 12 ఏళ్ల తర్వాత ఆస్తుల పంపకం పూర్తికాలేదు" అని రేణుకా చౌదరి తెలిపారు.

తెలుగుజాతికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా : అనంతరం బీజేపీ రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్ మాట్లాడుతూ, "రాజధాని కోసం 29 వేలమంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారు. భవ్య రాజధాని సాకారం కోసం ఏపీ ప్రజలు కలలు కన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పం తీసుకున్నారు. వికసిత్ భారత్ సాకారం కోసం వికసిత్ ఆంధ్ర నిర్మాణం ఆవశ్యకం. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం వికసిత్ రాజధాని అవసరం ఉంది. రాజధాని కోసం సుదీర్ఘంగా పోరాడిన మహిళలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు.

అమరావతికి చట్టబద్ధత బిల్లుకు మద్దతిస్తున్నాం : అనంతరం బీజేపీ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, " అమరావతికి చట్టబద్ధత బిల్లుకు మద్దతిస్తున్నాం. అమరావతిని రాజధాని చేయడం ప్రజలందరికీ ఆమోదయోగ్యం. అమరావతికి పూర్తిగా మద్ధతు ఇస్తున్నా. అమరావతి ఏపీకి మధ్యలో ఉంటుంది. పాలనాపరంగా సౌలభ్యంగా ఉంటుంది. అమరావతి అభివృద్ధికి చంద్రబాబు తీవ్రంగా కృషిచేస్తున్నారు. పవిత్ర భూమిలో రాజధాని తప్పనిసరిగా వర్ధిల్లుతుంది. అందరికీ ఆమోదయోగ్యమైన రాజధానిని అందరూ సమర్థించాలి' అని అన్నారు.

రాజ్యసభ నుంచి వైఎస్సార్సీపీ వాకౌట్ : అనంతరం వైఎస్సార్సీపీ రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ," రాజధాని రైతులకు ప్లాట్లు ఎప్పుడు ఇస్తుందనే దానిపై బిల్లులో స్పష్టత లేదు. రైతులకు ప్లాట్లు ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పాలి. ఏపీకి ప్రత్యేక హోదా విషయంపై బిల్లులో ప్రస్తావన లేదు. ప్రత్యేక హోదాపై ప్రస్తుత అధికార పార్టీ ఎప్పుడో మరచిపోయింది. ప్రత్యేక హోదాపై వైఎస్సార్సీపీ మాత్రం నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుంది. అమరావతి రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. వేలకువేల ఎకరాలు తీసుకున్నారు, ఏమాత్రం అభివృద్ధి చేయలేదు. ఇప్పటివరకు ఒక్క ప్లాటు కూడా అమరావతి రైతులకు ఇవ్వలేదు. ఈ భూములు చాలదన్నట్లు కొత్తగా మళ్లీ భూముల సేకరణ మొదలుపెట్టారు. అమరావతి రైతుల వేదన చంద్రబాబుకు పట్టట్లేదు. రెండేళ్లలోనే సుమారు రూ.3 లక్షల కోట్లు అప్పు చేశారు." అని ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. అనంతరం అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ సమయంలోనే వైఎస్సార్సీపీ వాకౌట్ చేసింది.

అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చలో 11 పార్టీల ఎంపీలు మాట్లాడారు. చర్చలో 17 మంది సభ్యులు పాల్గొన్నారు. వైఎస్సార్సీపీ మినహా అమరావతికి 10 పార్టీలు మద్దతు తెలిపాయి. ఎలాంటి సవరణలు లేకుండా ఉభయ సభల్లో అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందింది. ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధానిగా అమరావతి ఏర్పాటైన నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలో అమరావతి అంతర్జాతీయ నగరంగా ఎదుగుతుందని ఆకాంక్షించారు.

బిల్లుపై అన్ని పార్టీల సభ్యుల ప్రసంగాలపై జవాబిచ్చిన కేంద్రమంత్రి నిత్యానందరాయ్ ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి రూపంలో కొత్త రాజధాని వచ్చిందని అభినందనలు తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరడంతో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించేలా అమరావతి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. బిల్లుకు సభ్యులందరి మద్దతు ఉంది కనుక పాస్ చేయాలని రాజ్యసభ ఛైర్మన్‌ను కోరారు. అనంతరం సభ్యులందరి సమ్మతితో అమరావతికి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఛైర్మన్ సి.పి.రాధాక్రిష్ణన్ ఆమోదముద్ర వేశారు. సభ్యుల జై అమరావతి, జై భారత్ నినాదాలు సభలో మార్మోగాయి. వేంకటేశ్వరుడి ఆశీస్సులతో అమరావతి, ఆంధ్రప్రదేశ్ ప్రజలు వర్ధిల్లాలని ఉపరాష్ట్రపతి రాధాక్రిష్ణన్ ప్రార్థించారు.

అమరావతికి చట్టబద్ధత బిల్లుపై చర్చను మంత్రి నారా లోకేశ్, లోక్‌సభ ఎంపీలు, ముఖ్య నేతలతో కలిసి గ్యాలరీలో కూర్చొని ఆసక్తిగా వీక్షించారు. చర్చ ముగిసి బిల్లు ఆమోదం పొందగానే అంతా లేచి కరతాళధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు.

# మా గ్యారంటీలపై డౌట్ ఉంటే తెలంగాణ రండి

మొదటి పేజీ తరువాయి...

వారు తెలంగాణకు వచ్చి చూడాలని ఆయన బహిరంగ సవాల్ విసిరారు.కేరళ సీఎం పినరాయి విజయన్, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ పాలనలో అనేక పోలికలు ఉన్నాయని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఇద్దరూ అవినీతి, కుటుంబ పాలనలో ఆరితేరారని ఎద్దేవా చేశారు. "దేశాన్ని మోదీ పాలిస్తుంటే.. కేరళను విజయన్ పాలిస్తున్నారు. వీరిద్దరూ 'మోదీ బ్రదర్స్' లాంటి వారు" అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కేసీఆర్ పాలన ఎలాగైతే అంతమైందో, కేరళలో కూడా పినరాయి పాలన ముగిసి యూడీఎఫ్ స్వర్ణయుగం మొదలవుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణే మా ట్రాక్ రికార్డు.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి క్యాబినెట్ సమావేశం నుంచే గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.21 వేల కోట్ల రుణాలను తాము మాఫీ చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సాగు చేసుకునే రైతులకు ఎకరాకు రూ.12 వేలు చొప్పున ఏడాదికి రూ.18 వేల కోట్లు రైతు భరోసా కింద అందజేస్తున్నామని సీఎం తెలిపారు. 67,173 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, వివిధ శాఖల్లో నియామకాలు పూర్తి చేయడంతో పాటు ప్రజల సమక్షంలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశామని సీఎం వివరించారు.

చరిత్రలో లేని విధంగా మారిన కేరళ ఓటర్ సరళి!

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, 10 వేల బస్సులు, 50 వేల సిబ్బందితో ఉన్న ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకువచ్చామని సీఎం తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు నెలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఆదా అవుతోందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ~ాణ రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మహిళలను బస్సుల యజమానులుగా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ -2047 ప్రకారం తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపనున్నామని సీఎం ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ వృద్ధిరేటు 10.8 శాతంగా ఉందని, పన్నులు పెంచకుండానే అభివృద్ధి సాధ్యమని తాము నిరూపించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

కేరళ యూడీఎఫ్ మేనిఫెస్టో: 'ఇందిర ఐదు గ్యారంటీలు' కేరళ ఎన్నికల కోసం యూడీఎఫ్ ప్రకటించిన ప్రధాన హామీలను రేవంత్ రెడ్డి విడుదల చేశారు: ఉచిత ప్రయాణం: కేఎస్ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం. బాలికలకు భరోసా: కాలేజీ చదువుతున్న బాలికలకు నెలకు రూ. 1,000 ఆర్థిక సాయం. పెన్షన్ల పెంపు: సంక్షేమ పింఛన్లను నెలకు రూ. 3,000కు పెంచుతూ నిర్ణయం. ఆరోగ్య బీమా: మాజీ సీఎం ఊమెన్ చాండీ పేరుతో ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షల ఆరోగ్య బీమా. యువతకు రుణాలు: స్వయం ఉపాధి కోసం యువతకు రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు. వీటితో పాటు వయనాడ్‌లో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు, సముద్ర, విమానయాన రంగాల్లో ఐదు భారీ డ్రీమ్ ప్రాజెక్టులను మేనిఫెస్టోలో పొందుపరిచారు. కేంద్రం ఇచ్చే నిధులు మోదీ కరుణ కాదని, అది ప్రజల హక్కు అని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

### రూ.167 కోట్లు పలికిన రాజా రవివర్మ

# 'యశోదకృష్ణ' పెయింటింగ్

**కొనుగోలు చేసిన సైరస్ పూనావాలా**

**ముంబై, ఏప్రిల్ 2 (నమస్తే ఉదయం)**

ప్రముఖ భారతీయ చిత్రకారుడు రాజా రవివర్మ గీసిన యశోద, చిన్నికృష్ణుడి పెయింటింగ్ వేలంలో రూ.167.2 కోట్లకు అమ్ముడుపోయింది. ముంబైలో సాఫ్రాన్ ఆర్ట్ స్ప్రింగ్ లైవ్ ఆక్షన్ నిర్వహించగా, రాజా రవివర్మ గీసిన ఈ చిత్రాన్ని దక్కించుకునేందుకు చాలామంది పోటీపడ్డారు. చివరకు దీనిని ప్రముఖ పారిశ్రామికవేత్త, సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు సైరస్ పూనావాలా దక్కించుకున్నారు.

రాజా రవివర్మ ఈ ఆయిల్ పెయింటింగ్‌ను 1890లలో గీశారు. వేలంలో రూ.167 కోట్లు పలకడంతో అత్యంత ఖరీదైన ఆధునిక భారతీయ కళాఖండంగా యశోద, కృష్ణ చిత్రం నిలిచింది. గత సంవత్సరం ఎంఎఫ్ హుస్సేన్ గీసిన ఓ పెయింటింగ్ రూ.118 కోట్లకు అమ్ముడుపోయింది. దీనిని ఢిల్లీకి చెందిన కిరణ్ నాదర్ దక్కించుకున్నారు.

పెయింటింగ్ కొనుగోలు చేయడం ఎంతో గౌరవంగా ఉందని, ఇది తన బాధ్యత అని సైరస్ పూనావాలా మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ఇది జాతీయ సంపద అని, దీనిని క్రమంగా ప్రజల వీక్షణ కోసం అందుబాటులో ఉంచాలని ఆయన అభిప్రాయపడ్డారు.



## కాళేశ్వరంపై రాజ్యసభలో కిషన్‌రెడ్డి, సురేశ్‌రెడ్డిల వాగ్వాదం

మొదటి పేజీ తరువాయి...

కిషన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ చేసిన పోరాటం వల్లే తెలంగాణ సాకారమైందని సురేశ్‌రెడ్డి అన్నారు. " ప్రాంతాలుగా వేరవుదాం.. అన్నదమ్ముల్లా కలిసుందామని కేసీఆర్ అన్నారు. తెలంగాణ అనుమతి లేకుండానే కొన్ని మండలాలను ఏపీలో కలిపారు. ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసేటప్పుడు చర్చ జరగలేదు. తల్లిని చంపి బిడ్డను బతికించారని మోదీ అనేక సార్లు అన్నారు. ఏపీ విభజన బిల్లును పునర్నిర్మాణ బిల్లుగా చేయొద్దు. 12 ఏళ్లుగా తెలంగాణకు కేంద్రం ఎలాంటి సహాయం చేయట్లేదు. కేంద్రం సహకరించకున్నా.. తెలంగాణ అభివృద్ధి చెందుతోంది. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలి.

## తెలంగాణలో 2 లక్షల కొత్త పెన్షన్లు..

మొదటి పేజీ తరువాయి...

మంజూరు కాకపోవడంతో అర్హులైన వారు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షలకు పైగా దరఖాస్తులు ప్రభుత్వానికి చేరి పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల బడ్జెట్‌లో కొత్త పెన్షన్ల ప్రకటన వెలువడిన తర్వాత, ఫిబ్రవరి 20 నుంచి ప్రజావాణి వంటి కార్యక్రమాల ద్వారా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు, గురువారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామసభల్లో కూడా భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ఆమోదించినవి 2 లక్షల పెన్షన్లు కాగా, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య 12 లక్షలు దాటింది. వీటిలో వృద్ధాప్య పింఛన్ కోసం 4 లక్షలు, వితంతు, ఒంటరి మహిళల కోటాలో 3.5 లక్షలు, గీత, చేనేత కార్మికుల విభాగంలో 3 లక్షలు, దివ్యాంగుల పింఛన్‌కు 72 వేల దరఖాస్తులు ఉన్నాయి. ఈ భారీ సంఖ్య నుంచి కేవలం 2 లక్షల మంది అత్యంత అర్హులను ఎంపిక చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు త్వరలోనే పటిష్టమైన వడపోత కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది.

## మైనింగ్‌లో" చిన్న తప్పు" తెచ్చిన తంటా

**పటాన్ చెరులో పార్టీల మధ్య రాజకీయ మంట**

**అసెంబ్లీలో హరీష్ రావు ప్రసంగం తర్వాత... సవాళ్లు-ప్రతి సవాళ్ల మధ్య పటాన్ చెరులో రాజకీయ వేడి**

**హైదరాబాద్, ఏప్రిల్ 2, (నమస్తే ఉదయం):**



తెలంగాణ అసెంబ్లీలో మైనింగ్ శాఖపై చర్చ సందర్భంగా బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి. హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు పటాన్‌చెరు నియోజకవర్గ రాజకీయాల్లో అగ్ని రాజేశాయి. "మా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తమ్ముడు స్టోన్ క్రషర్ లో చిన్న తప్పు జరిగితే రాత్రికి రాత్రే జైల్లో పెట్టారు, కానీ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై ఎందుకు చర్యలు లేవు?" అని హరీష్ రావు అడిగిన ప్రశ్న రాజకీయ ఉద్రిక్తతను పెంచింది. దీంతో పటాన్‌చెరు బిఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ మధ్య సవాళ్లు-ప్రతి సవాళ్లు మొదలయ్యాయి. ఇది కేవలం అసెంబ్లీలో చర్చ మాత్రమే కాదు, తెలంగాణ రాజకీయాల్లో దీర్ఘకాలికంగా కొనసాగుతున్న 'రాజకీయ ప్రతీకారం' సంస్కృతికి మరో ఉదాహరణగా మారిందని చెప్పవచ్చు. మార్చి 28న అసెంబ్లీలో మైనింగ్ అంశంపై మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. నగర శివార్లలో అక్రమ క్రషర్లు నడుస్తున్నాయని, ప్రభుత్వ ఆదాయానికి కోట్లు గండి పడుతున్నాయని ఆరోపించారు. అదే సమయంలో గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డిని "చిన్న తప్పు" పేరుతో జైల్లో పెట్టిన విషయాన్ని లేవనెత్తి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై మాత్రమే కఠిన చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. ఇది పటాన్‌చెరులో రాజకీయ చిచ్చును రగిల్చింది. ఈ అంశంపై పటాన్ చెరు కాంగ్రెస్ ఇంచార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా స్పందించి, "గూడెం సోదరులు 340 కోట్ల రాయల్టీ ఎగ్గొట్టారు. ఇది చిన్న తప్పా? అవినీతి పరుడైన ఎమ్మెల్యే, ఆయన సోదరుడు కు హరీష్ రావు మద్దతు ఇవ్వడం సిగ్గుచేటు" అని , మాజీ మంత్రికి అవినీతిలో వాటా ఉందని ఫైర్ అయ్యారు. దీంతో బిఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దీనికి కౌంటర్ ఇచ్చి, కాటా ఆరోపణలను తోసిపుచ్చారు. ఈ సంఘటన తెలంగాణ రాజకీయాల్లో రెండు పార్టీల మధ్య ఉన్న 'ప్రతీకార రాజకీయాల'ను మరోసారి స్పష్టంగా బయటపెడుతోంది. బిఆర్ఎస్ పార్టీ వైపు నుంచి గమనిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతిపక్ష నాయకులపై ఈడీ, సీబీ-సీఐడీ, పోలీసు కేసులతో వేదిస్తోందని చేస్తున్న ఆరోపణ సరైనదేనని అనిపిస్తుంది. గూడెం మధుసూదన్ రెడ్డి అరెస్టు నుంచి ఇప్పటి వరకు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులపై కేసులు పెరిగాయి. కానీ కాంగ్రెస్ పార్టీ వైపు నుంచి పరిశీలిస్తే బిఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో మైనింగ్ శాఖను 'ఫ్యామిలీ బిజినెస్'గా మార్చిందని, కోట్ల రూపాయల ఆదాయం దారి మళ్లించి స్వప్రయోజనాల కోసం దోపిడీ చేసినట్లు చెపుతున్న ఆరోపణలు కూడా నిజమేగా అన్నట్టుగా కనిపిస్తుంది. హరీష్ రావు ఇప్పుడు "చిన్న తప్పు" అని చెప్పినా, మైనింగ్ శాఖ నివేదికలు మాత్రం గూడెం కుటుంబం నుంచి తప్పు జరిగిందని చెపుతున్నాయి. అటు అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలు అవలంబిస్తున్న తీరు, ద్వంద్వ వైఖరి ప్రజలను గందరగోళంలోకి నెడుతోంది. ఒకవైపు అక్రమ మైనింగ్ వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం, పర్యావరణ నాశనం ఇవి నిజమైన, తీవ్రమైన సమస్యలు. కానీ రాజకీయ నాయకులు వీటిని 'ప్రతీకార ఆయుధాలు'గా మార్చుకుని, సవాళ్లు-ప్రతి సవాళ్లతో స్థానిక నియోజకవర్గాల్లో వేడి పెంచుతున్నారు. పటాన్‌చెరులో ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థి కాటా శ్రీనివాస్ గౌడ్ సోదరుడు బిఆర్ఎస్‌లో చేరిన నేపథ్యంలో ఈ చిచ్చు మరింత లోతైన రాజకీయ వైరాన్ని చూపిస్తోంది. ఇది జిహెచ్ఎంసి ఎన్నికల ముందు ఓటు బ్యాంకులను లక్ష్యంగా చేసుకున్న స్థానిక ఎన్నిక సంగ్రామంగా కనిపిస్తోంది. హరీష్ రావు రాజేసిన కాక అటు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి,కాటా శ్రీనివాస్ గౌడ్ మధ్య రాజకీయ అగ్గి పుట్టించింది.జరుగుతున్న ఈ సవాళ్లు రాజకీయాలను మరింత హీన స్థితికి వచ్చేలా చేస్తున్నాయని ఘంటాపథంగా చెప్పవచ్చు. ప్రజలు కోరుకుంటున్నది'సెలెక్టివ్ జస్టిస్' కాదు ,అన్ని పార్టీలకు సమానంగా వర్తించే న్యాయం, అక్రమ మైనింగ్‌పై నిజమైన చర్యలు. లేకపోతే ఈ 'చిన్న తప్పు'- 'పెద్ద స్కామ్' డ్రామా కేవలం రాజకీయ ఎంటర్‌టైన్‌మెంట్‌గా మిగిలిపోయి, ప్రజా సమస్యలు మరింత వెనక్కి నెట్టబడతాయి అనేది కఠోర వాస్తవం. ఏదిఏమైనా రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరు అనేది జగమెరిగిన సత్యం. పటాన్‌చెరు ప్రజలు ఇప్పుడు ఈ రాజకీయ వేడిని ఎలా చూస్తారో అనేదే వారికి నిజమైన పరీక్ష. ఈ అంశంపై ఎలాంటి ముగింపు దొరుకుతుందో వేచి చూడాల్సిందే.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



రాజేంద్రనగర్ లో హనుమాన్ ర్యాలీ



రాజేంద్రనగర్ లో హనుమాన్ చాలీసా పారాయణం



అత్తాపూర్ లో రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ నాగేశ్వర్ రావు లు






గగన్ పహాడ్ లో జరిగిన హనుమాన్ ర్యాలీ లో పాల్గొన్న కాంగ్రెస్, బి ఆర్ ఎస్, బీజేపీ నాయకులు సరికొండ వెంకటేష్, శీలం తిరుపతి రెడ్డి, సూరెడ్డి వినయ్ రెడ్డి లు



గగన్ పహాడ్ లో...



రాంబాగ్ కాలా హనుమాన్ దేవాలయంలో...

**బుద్వేల్, ఏప్రిల్ 2 (నమస్తే ఉదయం)**

హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలో హనుమాన్ శోభా యాత్ర కన్నుల పండువగా జరిగింది. యువకులు పెద్ద సంఖ్యలో శోభాయాత్ర లో పాల్గొన్నారు. ప్రతి బస్తీ నుంచి ర్యాలీ లు నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ దేవాలయాలు భక్తులతో నిండిపోయాయి. బైక్ ర్యాలీలు, ఊరేగింపులు, అన్నదానాల తో హనుమాన్ దేవాలయాలు కళకళలాడాయి. రాజేంద్రనగర్ లో జరిగిన హనుమాన్ ర్యాలీ లో నాయకులు వై.శ్రీధర్, బ్రాహ్మణపల్లి బాల్ రాజ్, గుంజ బాబురావు, వెంకటరమణ, వై హరగోపాల్, దు ఒబాల ఉమారెడ్డి, పి రవీందర్, ఈ వేణు గోపాల్, ఎన్ రాధాక్రిష్ణ, బి. దీరజ్ యాదవ్లతో పాటు పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు. గగన్ పహాడ్ లో జరిగిన హనుమాన్ జయంతి ఊరేగింపు యాత్రలో వివిధ పార్టీల నాయకులు శీలం తిరుపతిరెడ్డి, ఎర్రాళ్ల యాదయ్య, సరికొండ వెంకటేశ్, సూరెడ్డి వినయెడ్డి, సూరెడ్డి సాయిరెడ్డి, శీలం సుధాకర్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, శశిధర్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, రమేశ్ లు పాల్గొన్నారు. హనుమాన్ జయంతి సం దర్భంగా రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ పర్యవేక్షణలో రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్ దేవుపల్లి ఇన్స్పెక్టర్లు ముత్తు యాదవ్, కె నాగేశ్వర్ రావు, సత్యనారాయణ లు పాల్గొన్నారు.



డాక్టర్ ఆర్ మహేందర్ కుమార్ దంపతులను సన్మానిస్తున్న ఐ ఐ ఆర్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం, శాస్త్రవేత్తలు

## ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ ఆర్ మహేందర్ కుమార్ కు ఘన సన్మానం

**బుద్వేల్, ఏప్రిల్ 2 (నమస్తే ఉదయం)**

జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్) లో ప్రధాన శాస్త్రవేత్తగా పనిచేస్తు ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ రాపోలు మహేందర్ కుమార్ దంపతులను గురువారం ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. డాక్టర్ ఆర్ మహేందర్ కుమార్ 35 సంవత్సరాలుగా శాస్త్రవేత్తగా దేశానికి సేవలందించారన్నారు. ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ ఆర్ మహేందర్ కుమార్ దంపతులను ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించడం జరిగిందన్నారు. డాక్టర్ మహేందర్ కుమార్ శ్రీ వరి సాగు ( సిస్టమ్ ఆఫ్ రైస్ ఇన్టెన్సిఫికేషన్) పద్ధతిని భారతీయ పరిస్థితులకు అనుగుణంగా మార్చి లక్షల ఎకరాలలో అమలు లోకి తీసుకురావడంలో ఆయన ఎంతో కృషి చేశారన్నారు.



డాక్టర్ ఆర్ మహేందర్ కుమార్ దంపతులు



మహిళా కాంగ్రెస్ నాయకురాలుతో...

## అస్సాం డిస్పూర్ నియోజకవర్గం కాంగ్రెస్ మైనారిటీ విభాగం ఇంచార్జిగా మహ్మద్ ఖాధర్

**బుద్వేల్, ఏప్రిల్ 2 (నమస్తే ఉదయం)**

అస్సాం రాష్ట్రంలోని డిస్పూర్ అసెంబ్లీకి కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం పరిశీలకులుగా అత్తాపూర్ సర్కిల్ మైలార్దేవుపల్లి బస్తీకి చెందిన మహ్మద్ ఖాదర్ ను నియమించారు. గురువారం మహ్మద్ ఖాదర్ అస్సాం డిస్పూర్ నియోజకవర్గానికి చేరుకుని కాంగ్రెస్ అభ్యర్థి మీరా బోర్తకూర్ గోస్వామి తో సమావేశమైనారు. అనంతరం ఆయన అస్సాం మైనారిటీ కాంగ్రెస్ ఇంచార్జి అస్లాం అలీ, కో ఇంచార్జి ఇక్బాల్ అహ్మద్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లంబా లను కలసి డిస్పూర్ లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం హ్యూహరచన చేశారు.



అస్సాం మైనారిటీ కాంగ్రెస్ నాయకులతో మహ్మద్ ఖాదర్



## కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్‌లో చేరిక

### కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి హరీష్ రావు

**పటాన్ చెరు, ఏప్రిల్ 2 నమస్తే ఉదయం):**


నియోజకవర్గ పరిధిలోని బొల్లారం డివిజన్ పోచమ్మ బస్తీకి చెందిన బొల్లారం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాకో-ఆర్డినేటర్ మొహమ్మద్ రఫీ తన అనుచరులతో కలిసి మాజీ మంత్రి హరీష్ రావు సమక్షంలో మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి,మాజీ ఎంపీపీ కొలన్ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ లో చేరారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు ఇంచార్జ్ వెన్నవరం ఆదర్శ రెడ్డి ,పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బొల్లారం మాజీ కౌన్సిలర్ వి.బీరప్ప యాదవ్,మాజీ ఎంపీటీసీ అరూర్ రత్నం,భాస్కర్ రెడ్డి,

సింహాచలం, మొహమ్మద్ నూర్,రాంశిష్,గోపాల కృష్ణ, ఏడుకొండలు,తురాబ్ అలీ ఖాన్,నాజీమ్ అన్సారీ,ఫయాజ్ ఖాన్,రాజు,మొహమ్మద్ మోసిన్ ఖాన్, మొహమ్మద్ యాసీర్ పాల్గొన్నారు.

## శ్రీ మహా చండీ సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి

**పటాన్ చెరు, ఏప్రిల్ 2 ( నమస్తే ఉదయం):**

పటాన్‌చెరు మండల పరిధిలోని నందిగామ గ్రామంలో సర్పంచ్ ఎల్లగోని విక్రమ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మహా చండీ సాహిత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాస్త్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా పాల్గొని, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించడంతో పాటు, సమాజంలో మానవతా విలువలను పెంపొందించేందుకు తోడ్పడతాయన్నారు. దేవాలయాల అభివృద్ధికి, భక్తుల సేవకు అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు మా పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.











ఫహాద్ పై దాడి చేసిన యువకులు

## పాతకక్షలతో ఓ యువకునిపై గొడ్డలి, కత్తులతో దాడి

**బుద్వేల్, ఏప్రిల్ 2 (నమస్తే ఉదయం)**



యువకులు వాడిన గొడ్డలి, కత్తులు

పాత కక్షలతో ఓ యువకునిపై మరో ముగ్గురు యువకులు గొడ్డలి , కత్తులతో తో విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటన మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాస్త్రీపురం కాలనీలో బుధవారం రాత్రి జరిగింది. ఇన్స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం వివరాలు ఈ విదంగా ఉన్నాయి... శాస్త్రీపురం లోని ఓ హోటల్ వద్ద బుధవారం రాత్రి ఒంటి గంటకు కూర్చుని ఉన్న మహ్మద్ పహద్ అలియాస్ పహాద్ బాబా అనే యువకునిపై అదే ప్రాంతానికి సయ్యద్ సైబాజ్ (19), షానవాజ్ ఖాన్ (19), రిజ్వాన్ బిన్ సులేమాన్ బహార్మజ్ (18) లు కలిసి దాడి చేశారు. తమ వద్ద ఉన్న గొడ్డలి, కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిలో ఫహద్ తలపై, చేతిపై, పలు చోట్ల గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పహద్ కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి పోలీసులకు వచ్చిన ఫిర్యాదు మేరకు మైలార్దేవుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మందు బాబుల దాడిలో పాన్ షాప్ నిర్వాహకునికి గాయాలు

**బుద్వేల్, ఏప్రిల్ 2 (నమస్తే ఉదయం)**



షేక్ వసీమ్

మద్యం మత్తులో ఉన్న యువకులు ఓ పాన్ షాప్ నిర్వాహకుణ్ని కట్టెలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామ న 4:20 గంటలకు జరిగింది. వివరాలు ఈ విదంగా ఉన్నాయి. హసన నగర్ కింగ్స్ కాలనీ కి చెందిన షేక్ వసీమ్(37) కు పీడీపీ చౌరస్తా ఆర్మాన్ హోటల్ వద్ద పాన్షాప్ ఉంది. ప్రతి రోజు ఉదయం 5గంటలకు పాన్ షాప్ ను తెరుస్తాడు. గురువారం తెల్లవారుజామున వసీమ్ పాన్షాప్ వైపు వస్తుండగా అటుగా వచ్చిన ముగ్గురు యువకులు పాన్షాప్ ఇతనిదే అంటు సిగరేట్ ఇవ్వాలని కోరారు. దానికి నేను ఇంకా పాన్షాప్ తెరవలేదు.. ఐదు గంటలలకు తెరుస్తాను అప్పుడిస్తాను అని చెప్పగా వారు అక్కడినుంచి వెళ్లిపోయారు. కొద్ది సేపు అయిన తర్వాత ఆ ముగ్గురు యువకులతో పాటు మరో పది మంది వరకు పాన్షాప్ వద్దకు వచ్చి వసీమ ను కట్టెలతో దాడి చేసి గాయపరిచారు... ఈ దాడిలో వసీమ్ ఎడమ చేతికి ప్రాక్చర్ అయ్యింది. వసీమ్ ఇచ్చిన పిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ పుటేజీ ఆధారంగా వసీమ్ పై దాడి చేసిన నిందితులను గుర్తించే పనిలో ఉన్నట్లు ఇన్స్పెక్టర్ కె నాగేశ్వర్ రావు తెలిపారు.

## సెల్ ఫోన్ లాక్కొవడానికి బ్లేడుతో గాయపరిచిన దొంగ

**బుద్వేల్, ఏప్రిల్ 2 (నమస్తే ఉదయం)**



శుభం

మైలార్దేవుపల్లి ఇందిరాగాంధీ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రాంతంలో శుభం అనే యువకుని చేతిలో ఉన్న సెల్ ఫోన్ లాక్కొవడానికి ప్రయత్నించిన దొంగ సెల్ ఫోన్ ను వదలకపోవడంతో బ్లేడుతో చేతికి గాయపరిచాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి జరిగింది. మైలార్దేవుపల్లి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన కధనం ప్రకారం... ఇందిరాగాంధీ కో ఆపరేటివ్ హౌసింగ్ సోసైటీ ప్రాంతంలో నివాసం ఉండే శుభం అనే యువకుడు బుధవారం రాత్రి పని ముగిం చుకుని ఫోన్ మాట్లాడుతూ ఇంటికి వెళుతున్నాడు. అదే సమయంలో అతని చేతిలో ఉన్న సెల్ఫోన్ ను లాక్కొవాలని ఓ దొంగ ప్రయత్నించాడు. శుభం ఫోన్ను వదలకపోవడంతో ఆ దొంగ తన చేతిలో ఉన్న బ్లేడు తీసి శుభం ఎడమ చేతి మణికట్టు దగ్గర కోసి పారిపోయాడు. శుభం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మైలార్ దేవుపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా మల్లయ్య

**బుద్వేల్, ఏప్రిల్ 2 (నమస్తే ఉదయం)**

అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా ఎల్ పి మల్లయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలో ఎలక్షన్స్ విభాగంలో జాయింట్ కమిషనర్గా పనిచేశారు. అత్తాపూర్ లో డిప్యూటీ కమిషనర్ గా పనిచేసిన వి సమ్మయ్య బడంగ్ పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా బదిలీ అయ్యారు. మూడు నెలల క్రితం కొత్తగా ఏర్పాటైన అత్తాపూర్ సర్కిల్ కు వి సమ్మయ్య మొదటి డిప్యూటీ కమిషనర్గా రాగా వచ్చారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతలు, ఆస్తి పన్ను వసూలు లో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పారిశుధ్య నిర్వాహణ పై ప్రత్యేక దృష్టి సారించి పనిచేశారు. అంతలోనే ఆయన బదిలీ కావడం విశేషం.

# సైబరాబాద్‌లో 'బదిలీ' ప్రకంపనలు: పైరవీలకే పీట వేస్తున్నారా?

**లూప్ లైన్ లో పనిచేస్తున్న సీనియర్లు జూనియర్లకు అవకాశం ఇస్తే బాగుంటుందని అభిప్రాయం**

**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 2, (నమస్తే ఉదయం)**



ఎక్కడైనా పోలీస్ విభాగంలో బదిలీలు అంటేనే అదో పెద్ద ప్రహసనం. కానీ, ఐటీ హబ్‌గా పేరొందిన సైబరాబాద్ కమిషనరేట్‌లో సీఐల బదిలీలు మాత్రం తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. సమర్థులకు కాకుండా, రాజకీయ అండదండలు ఉన్నవారికే కీలక పోస్టింగ్స్ దక్కుతున్నాయనే ఆరోపణలు కమిషనరేట్ వర్గాల్లో గుసగుసలకు తావిస్తున్నాయి. గురువారం "నమస్తే ఉదయం" వచ్చిన సైబరాబాద్ లో సీఐల బదిలీలపై వచ్చిన వార్త ప్రకంపనలు సృష్టించింది. మళ్ళీ పాత కాపులకే పోస్టింగ్స్ హవా?

రెండేసి, మూడేసి సార్లు అద్భుతమైన స్టేషన్లలో పోస్టింగ్స్ పొందిన వారే, మళ్ళీ తమ పలుకుబడిని ఉపయోగించి అవే కీలక స్థానాల కోసం ప్రయత్నాలు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లూప్ లైన్లలో (ప్రాధాన్యత లేని విభాగాల్లో) ఏళ్ల తరబడి మగ్గిపోతున్న అధికారులు ఈ పరిణామాలను చూసి పెదవి విరుస్తున్నారు. "ఒకరే ఎన్నిసార్లు క్రీమ్ పోస్టింగ్స్ దక్కించుకుంటారు?" అని కొందరు సీనియర్లు, జూనియర్ అధికారులు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు.

**అవినాష్ మహంతి పాలన ఒక తీపి గుర్తు**

ప్రస్తుత గందరగోళం మధ్య, గత పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి హయాంలో జరిగిన బదిలీలను సిబ్బంది గుర్తు చేసుకుంటున్నారు. "అలాంటి అధికారి మళ్ళీ రారు" అంటూ నిట్టూరుస్తున్నారు. ఆయన హయాంలో పారదర్శకత పెద్ద పీట వేయడంతోపాటు ప్రాంతీయ విభేదాలు చూడకుండా అందరికీ సమాన న్యాయం చేశారు. అవినీతిపై ఉక్కుపాదం మోపిన మహంతి అవినీతి ఆరోపణలు ఉన్న వారిని పక్కన పెట్టి, క్లీన్ ఇమేజ్ ఉన్న వారికి అవకాశం ఇచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతిభ గల సినియర్స్, జూనియర్లకు అధికారులకు ఫీల్డ్ పోస్టింగ్స్ ఇచ్చి ప్రోత్సహించారు.

అవినాష్ మహంతి బదిలీల విషయంలో ప్రజా ప్రతినిధులకు ప్రాధాన్యత ఇచ్చినా కొంత ఆయన మార్కు బదిలీలలో స్పష్టంగా కనిపించేది. కేవలం మెరిట్ తోపాటు సర్వీస్ రికార్డు ఆధారంగానే నిర్ణయాలు ఉండేవని పోలీసులు చర్చించుకుంటున్నారు. కొందరు సీఐలు ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేయడం

ప్రస్తుతం పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చిందని విమర్శలు వస్తున్నాయి. బదిలీల ప్రక్రియ మొదలవ్వగానే, తమకు నచ్చిన స్టేషన్ల కోసం సీఐలు ఎమ్మెల్యేల ఇళ్ళ చుట్టూ ప్రదర్శనలు ఇస్తున్నారు. సిఫార్సు లేఖల కోసం పోటీ పడుతున్నారు. ప్రస్తుత సీపీ ఎమ్మెల్యే లకు ప్రాధాన్యత ఇచ్చిన ఒకటి లేక రెండు పోస్టింగ్స్ ఇచ్చి మిగిలిన పోస్టింగులనైనా సీపీ తన విచక్షణ అధికారంతో సమర్థులకు ఇవ్వాలి" అనేది జూనియర్ల, సినియర్లు అభిప్రాయపడుతున్నారు.

**సీపీ మార్కు 'వడపోత' అవసరం**

ప్రస్తుత కమిషనర్ తనదైన శైలిలో ఈ బదిలీల ప్రక్రియను 'ఫిల్టర్' చేయాలని కింది స్థాయి అధికారులు కోరుతున్నారు. సైబరాబాద్ అంటే ఐటి హబ్ రియల్ ఎస్టేట్ కు గుండె కాయ లాంటి కమిషనరేట్ లో పని చేసేవారిని కొంచం సమర్ధులను ఎంపిక చేసి పోస్టింగ్ ఇవ్వాలని పైరవీకారులను దూరం పెట్టి, నిజాయితీగా పని చేసే వారికి అవకాశం కల్పిస్తేనే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికే రెండు, మూడు సార్లు కీలక పోస్టింగ్స్ చేసిన వారిని పక్కన పెట్టి లూప్ లైన్ ఉన్న సమర్థులను గుర్తించాలని అంటున్నారు. రాజకీయ జోక్యానికి నియంత్రణ ఉండాలి సిఫార్సుల కంటే విధి నిర్వహణకు పెద్దపీట వేయాలికోరుతున్నారు. సైబరాబాద్ వంటి కీలకమైన కమిషనరేట్‌లో పోస్టింగ్స్ కేవలం 'పైరవీ' ఆధారంగా జరిగితే, అది వ్యవస్థను నిర్వీర్యం చేయడమే అవుతుంది. కొత్త రక్తం, ఉత్సాహవంతులైన జూనియర్ అధికారులకు అవకాశం కల్పించినప్పుడే పోలీసింగ్ మెరుగుపడుతుంది. గత సీపీ అవినాష్ మహంతి తరహాలో కఠినంగా వ్యవహరించి, తన మార్కును చాటుకోవాలని పలువురు పోలీసు అధికారులు సూచిస్తున్నారు.



# బాబు జగ్జీవన్ రామ్ జయంతి, అంబేద్కర్ జయంతి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 02(నమస్తే ఉదయం):**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సంఘ సంస్కరణల కోసం కృషి చేసిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి, అంబేద్కర్ జయంతి వేడుకలకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై డీసీపీ రాజా మహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వివిధ కుల సంఘాల ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 5న బాబు జగ్జీవన్ రామ్ జయంతి, అలాగే 14వ తేదీన బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ లు సమాజ సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన సేవలను గుర్తు చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. వారి ఆశయాలకు అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. జయంతి రోజున వారి విగ్రహాలకు పుష్పాంజలి ఘటించడం, శుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం వంటి కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. వేడుకల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్సీ సంక్షేమ అధికారి విక్రమ్, ఆర్డీఓ గోపీరాం, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, అంబేద్కర్ యువజన సంఘాల, కుల సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



# పటాన్చెరులో శోభాయమానంగా హనుమాన్ జయంతి వేడుకలు

**ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు, ఏప్రిల్ 2 (నమస్తే ఉదయం):**



పటాన్చెరు పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలు శోభాయమానంగా జరిగాయి. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పటాన్చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్, మహాదేవుని ఆలయం, చైతన్య నగర్, నర్ర బస్తి, శాంతినగర్, జెపి కాలనీ పంచముఖి హనుమాన్ దేవాలయాలలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులందరూ సనాతన ధర్మాన్ని ఆచరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. భారతీయ పురాణాలలో అపారమైన భక్తి, శక్తి, ధైర్యానికి ప్రతీకగా నిలిచిన హనుమంతుని జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయంగా నిలుస్తుందని అన్నారు. నేటితరం యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అనంతరం పంచముఖి హనుమాన్ దేవాలయం వద్ద వీర హనుమాన్ శోభాయాత్రను జెండా ఊపి ప్రారంభించారు.



మాట్లాడుతున్న బనుక శివరాజ్ యాదవ్

# ప్రజా పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి

**ఏఎంసి చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 02(నమస్తే ఉదయం):**

ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక లో భాగంగా 99 రోజుల కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న గ్రామసభల సందర్భంగా జనగామ మండలం శామీర్ పేట సర్పంచ్ గణిపాక వనిత, గోపరాజు పల్లి సర్పంచ్ తోటపల్లి రాజేశ్వరి, ఓబుల్ కేశ్వాపూర్ సర్పంచ్ జెన్నేపల్లి జనార్ధన్ రెడ్డి, వివిధ గ్రామాలలో సర్పంచ్ ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ ప్రజా పాలన లో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి క్లుప్తంగా ప్రజలకు,రైతులకు మహిళా లకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు,సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు అల్లం నరేందర్, జనగామ మండలం కాంగ్రెస్ పార్టీ లింగాల నర్సిరెడ్డి, ఏఎంసి డైరెక్టర్ నామాల శ్రీనివాస్, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు గణిపాక మహేందర్, ప్రజాప్రతినిధులువార్డు సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు సాదం మధుసూదన్, దాసరి శేఖర్, చడగొండ కృష్ణ రెడ్డి, కంసాని భాస్కర్ రెడ్డి, బాల్నే సుధాకర్, రాజు, ఆనందం, బిక్షపతి, కుమార్ యాదవ్, పృథ్వీరాజ్ వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



కోఆర్డిస్ కమిటీ మీటింగ్ కి హాజరైన
సైబరాబాద్ సిపి రమేష్ రెడ్డి, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, ఉన్నతాధికారులు

# మౌలిక వసతులు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారమే లక్ష్యం: సైబరాబాద్ సీపీ

**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 2,( నమస్తే ఉదయం)**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించి, మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమగ్ర సమన్వయ సమావేశం సైబరాబాద్ కమిషనర్ కార్యాలయంలో జరిగింది. సైబరాబాద్ సీపీ ఎం. రమేష్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో సిఎంసి కమిషనర్ జి. శ్రీజన, మెట్రో వాటర్ బోర్డ్ ఎండీ అశోక్ రెడ్డి సహా పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలోని వానాకాలంలో సమస్యలపై తక్షణ పరిష్కారానికి ప్రత్యేక కస్టమర్ కేర్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. నీరు నిలిచే 54 ప్రాంతాలను గుర్తించి, అక్కడ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని నిర్ణయించారు. పాదచారుల రక్షణ కోసం మెట్రో పిల్లర్ల మధ్య సెంట్రల్ మీడియన్ ఎత్తు పెంచాలని, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, చెట్లను తొలగించాలని సంబంధిత అధికారులను సీపీ కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫ్లైఓవర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల పనులను వేగవంతం చేయడంతో పాటు, కొత్తగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు, ఉన్న వాటికి మరమ్మతులు చేయనున్నారు. వేసవి దృష్ట్యా 3,000 వాటర్ ట్యాంకర్లను సిద్ధం చేశామని, వీటికి నో ఎంట్రీ సమయాల్లో మినహాయింపు ఇవ్వాలని సీపీని వాటర్ బోర్డ్ అధికారులు కోరారు. అత్యవసర పరిస్థితుల్లో అన్ని శాఖలు ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని సీపీ సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు అన్నపూర్ణ, రితిరాజ్, శేషాద్రి రెడ్డి, రంజన్ రతన్ కుమార్, హైడ్రా అదనపు డైరెక్టర్ పాపయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.



సర్దార్ పాపన్న కు నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ త్యాగస్ఫూర్తి యువతకు ఆదర్శం

**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 02(నమస్తే ఉదయం):**

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సామాజిక సమానత్వం, న్యాయం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమనిఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని సూచించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలను స్మరించుకోవడం ద్వారా సమాజంలో మంచి విలువలు పెంపొందుతాయని కలెక్టర్ తెలిపారు. అనంతరం అధికారులు, సిబ్బంది కూడా పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎన్. ఎల్. నరసింహ రావు, ఏబీసీడీఓ రవీందర్, డీఎల్పీఓ (ఇంచార్జి )వెంకట్ రెడ్డి, దిశ కమిటీ సభ్యులు బక్క శ్రీనివాస్, బీసీ కుర్మ సంఘం జనరల్ సెక్రటరీ జాయ మల్లేష్, వైద్యులు కాల్నాల్ మాచర్ల బిక్షపతి, బీసీ జేఏసీ అధ్యక్షులు, వసతి గృహ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ కష్టాలకు 'షేరింగ్'తోనే చెక్

## మాదాపూర్ పోలీసుల సర్వేలో ఆసక్తికర అంశాలు

**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 2,(నమస్తే ఉదయం)**




సైబర్ టవర్ వద్ద వాహనా రద్దీపై సర్వే చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు...

ఐటీ హబ్ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని అరికట్టే వ్యూహంలో భాగంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆదేశాల మేరకు మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ పర్యవేక్షణలో సైబర్ టవర్స్ పరిసరాల్లో మార్నింగ్ పీక్ అవర్‌లో చేపట్టిన ఈ మాన్యువల్ సర్వేలో విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి.

**సింగిల్ రైడర్లే ప్రధాన కారణం**

సర్వే వివరాల ప్రకారం, కేవలం ఒక గంట వ్యవధిలోనే రోడ్డుకు నాలుగు వైపులా కలిపి 10,138 మంది సింగిల్ రైడర్లు (వాహనంలో ఒక్కరే ప్రయాణించేవారు) ప్రయాణించడం గుర్తించారు. దీనికి భిన్నంగా డబుల్ రైడర్లు కేవలం 3,584 మంది మాత్రమే ఉన్నారు. అంటే డబుల్ రైడర్ల కంటే సింగిల్ రైడర్లు 6,554 అధికంగా ఉండటం వల్లే రహదారులపై వాహనాల సంఖ్య అనూహ్యంగా పెరిగి తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లకు దారితీస్తోందని స్పష్టమైయింది. ఒక్కొక్కరు ఒక్కో వాహనంపై ప్రయాణించడం వల్ల కలిగే నష్టాలను పోలీసులు ఈ సందర్భంగా వాహనదారులకు వివరించారు. ట్రాఫిక్‌లో గంటల తరబడి చిక్కుకోవడం వల్ల విలువైన సమయం వృధా అవుతోంది. అదనపు ఇంధన ఖర్చులు వ్యక్తిగత బడ్జెట్‌పై ప్రభావం చూపుతాయని తెలిపారు. వాహనాల నుండి వెలువడే కార్బన్ ఉద్గారాల వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడమే కాకుండా, శారీరక అలసట, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెప్పారు. రహదారులపై వాహనాల సాంద్రత పెరగడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం పెరుగుతుందని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ ధోరణి మారాల్సిన అవసరం ఉందని ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఐటీ ఉద్యోగులు, పౌరులు తమ ప్రయాణాల్లో చిన్నపాటి మార్పులు చేసుకోవడం ద్వారా ట్రాఫిక్ రహిత సైబరాబాద్‌ను నిర్మించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. సాధ్యమైనంత వరకు రైడ్ షేరింగ్ పద్ధతిని పాటించావని సూచించారు. సహోద్యోగులు లేదా స్నేహితులతో కలిసి కార్ పూలింగ్ చేయాలని వివరించారు. మెట్రో, బస్సు వంటి ప్రజా రవాణా వినియోగించుకోవాలి. పీక్ అవర్స్‌లో అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత వాహనాల వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. రద్దీ సమయాల్లో ప్రయాణించకుండా ముందస్తు ప్రణాళిక చేసుకోవాలని వాహనదారులకు వివరించారు. ఈకార్యక్రమంలో మాదాపూర్ ఎస్ హెచ్ఓ శ్రీధర్ కుమార్, ఆర్.ఐ శ్రీకాంత్, ఎస్ఐలు టీవీ రావు, రాములుతోపాటు ఇతర సిబ్బంది పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733